
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 31 అక్టోబరు 2025



నేలవాలిన ఆశలు


మోరపల్లిలో నేల వాలిన వరిని చూపుతున్న రైతు


రాయికల్‌లో నేల వాలిన వరి పంట

- మొంథా తుఫానుతో జిల్లాలో తీవ్ర నష్టం
- 17,982 ఎకరాల్లో దెబ్బతిన్న వరి పంట
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఆందోళనలో అన్నదాతలు

జగిత్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను జిల్లా రైతులకు నిద్ర లేకుండా చేసింది. రెండు రోజులుగా వర్షాలు కురవడం, మేఘాలు కమ్ముకొని ఉండడంతో వడ్లను కుప్పలు చేసి టార్పాలిన్లు కప్పేసి ఉంచారు. వాతావరణ మార్పులతో వడ్లలో తేమ శాతం ఎక్కడ మారిపోతుందన్న ఆందోళన అందరిలో నెలకొంది. ఇటు వ్యవసాయ అధికారుల సూచన మేరకు రైతులు పంట కోతలను వాయిదా వేశారు. కొన్ని కోట్ల విలువైన ధాన్యం కల్లాలు, రోడ్లపై ఉండడంతో జిల్లా అధికార యంత్రాంగం అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖ సిబ్బందిని ఆదేశించింది.


పెగడపల్లి మండలం ఆరవెల్లిలో తడిసిన ధాన్యం

ఆగిన కాంటాలు..

జిల్లాలో వానాకాలం సీజన్‌లో మొత్తం 3.15 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేసినట్లు నమోదు చేశారు. అధికారిక లెక్కల ప్రకారం 7.50 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 8 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసి అందుకు అనుగుణంగానే 421 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.తుఫాను కారణంగా జిల్లా అంతటా వర్షాలు కురుస్తుండడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం చేయడం లేదు. రెండు రోజులుగా కాంటాలు నిలిపివేశారు. దీంతో రైతులు పంటను అమ్ముదామన్నా తీసుకునే పరిస్థితి లేదు. వర్షాలు తగ్గుముఖం పట్టి ఎండ వాతావరణం ఏర్పడితే మళ్లీ కాంటా చేయడం ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

దిగుబడి తగ్గి.. రంగు మారి

మొంథా తుఫాను ప్రభావంతో బలమైన గాలులు వీయగా వరి నేల వాలింది. వర్షంతో పొలాల్లో నీరు నిలిచి వరి పంట దెబ్బతిన్నది. పత్తిలో వర్షపు నీరు చేరడంతో నల్లబారే ప్రమాదంతో పాటు దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి కూడా కోత దశలో ఉండగా ధాన్యం రంగు మారుతుందని అంటున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల వరి కోయగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదని, ప్రైవేటులో వ్యాపారులు తక్కువ ధరకే అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. ఇక దిగువ ప్రాంతాల్లోని వరి పొలాలను వర్షపు నీరు ముంచెత్తడంతో మొలకలు వచ్చే ప్రమాదముంది. పైరు నేలవాలడంతో హార్వెస్టర్లతో కోసే అవకాశం లేకుండా పోతోంది. పత్తి కాయలు పగిలి, దూది బయటకు వస్తున్న తరుణంలో భారీ వర్షాలు కురవడంతో దూది పూర్తిగా తడిచిపోయింది. ఇప్పటికే సీసీఐ విధించిన నిబంధనలతో సతమతం అవుతుండగా తెల్లబంగారం సాగు చేసిన రైతులకు తుపాన్ ప్రభావంతో మరింత నష్టం వాటిల్లనుంది.

అప్పుల ఊబిలో అన్నదాత..

విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చుల రూపంలో రూ.లక్షలు అప్పు చేసి పంట పండించిన రైతులు తుఫానుతో తీవ్రంగా నష్టపోయారు. వర్షాలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని ఇప్పటికే వ్యవసాయ కమిషనరేట్ నుంచి జిల్లా వ్యవసాయ అధికారులకు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో అధికారులు వెంటనే క్షేత్ర స్థాయిలో పర్యటించి నష్టపోయిన పంట విస్తీర్ణాన్ని అంచనా వేయాలని, నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందించాలని వేడుకుంటున్నారు. రంగు మారిన, తడిచిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని అంటున్నారు.

మిగతా 8వ పేజీలో..

పంట నష్టపోయా

మల్లేశ్, రైతు, మోరపల్లి, జగిత్యాల రూరల్ మండలం



తుఫాను ప్రభావంతో కురిసిన వర్షం వల్ల పంట నష్టపోయాం. చేతికొచ్చిన వరి పంట నేల వాలి గింజలు రాలిపోయి నష్టపోయా. మరికొందరు రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించినప్పటికీ వర్షం వల్ల కుప్పల వద్ద నీరు నిలవడం, ధాన్యం తడిచిపోవడం వంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రైతులను ఆదుకోవాలి

కల్వకుంట్ల సంజయ్, కోరుట్ల ఎమ్మెల్యే



జిల్లాలో వర్షం రైతులు తీవ్రంగా పంట నష్టపోయారు. పలు ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరి పంట నేలవాలింది. కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం కుప్పల వద్దకు వర్షపు నీరు వచ్చి చేరింది. తేమ శాతం పడిపోవడం వల్ల ధాన్యం విక్రయాల సందర్భంగా ఇబ్బందులు ఎదురవుతుందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పరిశీలించి బాధిత రైతులను ఆదుకోవాలి.


గోదూరులో పొలంలో నిలిచిన వర్షపు నీరు


గొల్లపల్లి శివారులో పత్తిచేనులో నిలిచిన వర్షపు నీరు


వెల్గటూరు పత్తిచేనులో నిలిచిన వర్షపు నీరు

విద్యార్థుల సంక్షేమానికి చర్యలు

-జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


వసతిగృహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో దరూర్ క్యాంపులో గల ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నట్లు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ అన్నారు. ఇటీవల ఎనిమిదో తరగతి చదువుతున్న హిమేష్ చంద్ర అనే విద్యార్థికి హాస్టల్ బిల్డింగ్‌పై పిడుగు పడి తీవ్ర గాయాలు కాగా హాస్టల్‌ను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలు తెలుసుకొని పిడుగు పాటుకు దగ్ధం అయిన గదిని పరిశీలించారు. వసతి గదులు, వంట గది పరిశీలించారు. విద్యార్థి హిమేష్ చంద్ర హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో మెరుగైన చికిత్స పొందుతూ ఉన్నాడని, ప్రాణాపాయం లేదని ఈసందర్భంగా విద్యార్థులకు ధైర్యం చెప్పారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో ప్రభుత్వం తరపున రూ.5లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేసి యశోద ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామన్నారు. పిడుగుపాటుకు దెబ్బతిన్న గది, డ్రైనేజీ, సెప్టిక్ ట్యాంక్ సమస్య తన దృష్టికి వచ్చిందని తెలిపారు. డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, నాణ్యమైన భోజనానికి 40 శాతం డైట్ చార్జీలు పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సంపత్ కుమార్, మాజీ కౌన్సిలర్ శ్రీలత రామ్మోహన్ రావు, ఎంఆర్‌పీఎస్ నాయకులు బాలే శంకర్, దుమల రాజ్ కుమార్, దుమాల గంగారాం, సురుగు శ్రీనివాస్, బొల్లి అనిల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలి

-ఎస్పీ అశోక్ కుమార్


రక్తదానం చేస్తున్న డీఎస్పీ

జగిత్యాల టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఆపదలో ఉన్నవారి ప్రాణం కాపాడాలని ఎస్పీ అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టూట్‌ల్లో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో గురువారం మెగా రకతదాన శిభిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అమరవీరులను ఎప్పటికీ మర్చిపోకుండ నిత్యం గుర్తు చేసుకోవడానికి జిల్లాలో పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలీసులు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు యువత నుండి విశేష స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. రక్తదానం చేయడం ద్వారా శరీరంలో కొత్త రక్తం ఉత్పత్తి అయి ఆరోగ్యంగా ఉంటామని సూచించారు. డీఎస్పీలు వెంకటరమణ, రఘు చంధర్, సర్కిల్ సీఐలు ఎస్సైలు, పోలీసు సిబ్బంది, యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సుమారు 200యూనిట్ల బ్లడ్‌ను పోలీసులు రెడ్ క్రాస్ సొసైటీ వారికీ అందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటరమణ, రఘు చందర్, డాక్టర్ దీపిక, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ అరిఫ్ అలీఖాన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సైదులు, రామ్ నర్సింహరెడ్డి, రవి, కరుణాకర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

భీమారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పీఏసీఎస్ చైర్మన్ కానుగంటి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు చెక్కపెల్లి సంజీవ్, రైతులు గండి రవి, పల్లి గంగాధర్, భీమయ్య పాల్గొన్నారు.

ఉపాధిహామీ గ్రామ సభలు

కొడిమ్యాల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామకిష్టాపూర్, డబ్బు తిమ్మయ్యపల్లి, కోనాపూర్, చెప్యాల గ్రామాల్లో గురువారం ఈజీఎస్ అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. ఉపాధిహామీ పనుల్లో అభివృద్ధి పనులను ఎంపికపై చర్చించారు. నీటి సంరక్షణ పనుల, పండ్ల తోటల పెంపకం పనుల గురించి గ్రామస్థులతో చర్చించారు. గ్రామ సభలో ఏపీవో సతీష్, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, స్వామి, మహేష్, అరవింద్, టీఏలు శ్రీనివాస్, గౌతమి పాల్గొన్నారు.

పంటల పరిశీలన

బీర్‌పూర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలో వర్షం కారణంగా దెబ్బతిన్న వరి, పత్తి పంటలను గురువారం మండల వ్యవసాయ అధికారులు పరిశీలించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏవో తిరుపతి, ఏఈవో వినోద్, శిరీష, రైతులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

-స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజాగౌడ్, పాల్గొన్న అధికారులు

జగిత్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యుద్ధ ప్రాతిపదికన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వివరాలను, సమస్యలను అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌కు అధికారులు వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు మార్కౌట్, బేస్మెంట్, గోడల, స్లాబ్ దశకు వరకు వచ్చిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్లస్టర్ వారీగా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని తెలిపారు. పనులలో సమస్యల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ కమిటీలను సమన్వయం చేసుకుంటూ పనులు తొందరగా పూర్తి చేయాలని కోరారు. నిర్మాణం పనులు త్వరగా చేపట్టాలని లబ్ధిదారులకు తెలుపాలన్నారు.

ప్రొసీడింగ్ ఇచ్చిన ఇళ్లనిర్మాణం పనులు ప్రారంభించకపోతే రెండు, మూడు సార్లు నోటీసులు ఇచ్చి ఇతర అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. పనులు పూర్తి చేసిన లబ్ధిదారులకు ఖాతాల్లో డబ్బులు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి ప్రసాద్, డీఈ భాస్కర్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, క్లస్టర్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

రాయికల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. మండలంలోని అల్లీపూర్, సింగ్రావుపేట గ్రామాల్లోని పీఏసీఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన వరిధాన్యాన్ని అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులకు సమస్యలు తలెత్తకుండా కొనుగోలు కేంద్రం నిర్వాహకులు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి, సివిల్ సప్లై డీఎం జితేంద్రప్రసాద్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ వరంధన్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మల్లాపూర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని జిల్లా విద్యాధికారి రామునాయక్ సూచించారు. గురువారం మండలంలోని మల్లాపూర్, రాఘవపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో దామోదర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. నాణ్యమైన ఆహారం అందించాలని డీఈవో పలు సూచనలు చేశారు. అనంతరం కస్తూర్బా విద్యాలయాన్ని ఆయన సందర్శించారు.

మైనింగ్, క్వారీ లీజు రెన్యూవల్‌కు అనుమతి తప్పనిసరి

-కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మైనింగ్, క్వారీ లీజు రెన్యూవల్, నూతన క్వారీల మంజూరు కోసం రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ అధ్యయనం సంస్థ(సీయా) జారీ చేసిన పర్యావరణ అనుమతి తప్పనిసరి అని కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతికి అత్యంత ఆవశ్యకమైన జిల్లా సర్వే నివేదికను పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం జిల్లా సర్వే నివేదికను రూపొందించినట్లు తెలిపారు. ఈ డ్రాఫ్ట్ జిల్లా సర్వే నివేదికను ప్రజా అభిప్రాయం కోసం నిర్ణీత జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. ఈ డ్రాఫ్ట్ జిల్లా సర్వే నివేదికపై అభిప్రాయాలను జిల్లా మైనింగ్ కార్యాలయంనకు 21 రోజుల లోపు పంపగలరని కలెక్టర్ సత్య ప్రసాద్ ప్రకటనలో తెలిపారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

కోరుట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 31వ తేదీన నిర్వహిస్తున్న ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మిక సంఘ నాయకులు బీడి కార్మికులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు కోరారు. గురువారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో బీడి కార్మికులు, కార్మిక సంఘ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమం చేసి 1920 ఏఐటీయుసీ సంఘం ఏర్పాడిందని అన్నారు. ఆవిర్భావ దినోత్సవానికి అధిక సంఖ్యలో కార్మిక సంఘ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ముక్రం, కొక్కుల శాంత, ఎన్నం రాధ, రామిల్ల రాంబాబు, వెన్న మహేష్, మునుగోరీ హనుమంతు, భూమేశ్వర్, మహ్మద్ ఉస్మాన్, చిన్నమేణి దశరథం, సాయిఈశ్వరీ, సంగం పద్మ, మదురమ, కూన సరస్వతి, శారద పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం పెద్దపల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పెంజర్ల లక్ష్మీనారాయణ(35) బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈక్రమంలో బస్టాండ్ నుంచి గోదావరిఖని వెళ్లే బస్సు సిగ్నల్ వద్ద లక్ష్మీనారాయణను ఢీకొట్టింది. స్థానికులు వెంటనే అతన్ని ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అప్పటికే వైద్యులు అతడు మృతిచెందినట్లు ప్రకటించారు. మృతుడు లక్ష్మీనారాయణ తల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జంపేట గ్రామానికి చెందిన దేశినిరాజు గురువారం తాడిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద జారిపడ్డాడు. అతని కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కాగా, మాజీఎంపీపీ సారయ్యగౌడ్, మాజీఎంపీటీసీ పోసాల సదానందంతోపాటు గ్రామస్థులు కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజును కరీంనగర్‌కు తరలించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి జైలు శిక్ష

● ముగ్గురికి జరిమానా

కోల్‌సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఒకరికి జైలు శిక్ష, ముగ్గురికి జరిమానాను గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ విధించినట్టు రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బీ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. గోదావరిఖనికి చెందిన రాయమల్లు అనేవ్యక్తి మద్యం సేవించి రెండోసారి పట్టుబడగా అతనికి మూడురోజుల జైలు శిక్ష విధించి కరీంనగర్ జైలుకు తరలించిట్టు, మరోముగ్గరికి రూ.6వేల జరిమానా విధించినట్టు ఆయన తెలిపారు.

ఇసుక మాఫియాపై అధికారుల కొరడా



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ట్రాక్టర్లు, టిప్పర్లు (ఫైల్)

● రెవెన్యూ బృందాల ఆకస్మిక దాడులు
● ట్రాక్టర్లు, టిప్పర్లు పట్టివేత

కథలాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలో రెవెన్యూ, పోలీసు, మైనింగ్, స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ విభాగాలు ఇసుక మాఫియాపై కొరడా ఝుళిపిస్తున్నాయి. గ్రామ పాలనాధికారులతో కలిసి బృందాలు ఎప్పటికప్పుడు కథలాపూర్ మండలంలోని పెద్దవాగులో రాత్రివేళల్లో నిఘా పెంచి ఆకస్మికంగా దాడులు చేస్తుండడంతో అక్రమార్కులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కథలాపూర్ పెద్దవాగు వెంట ప్రతీ రోజు సుమారు వంద ట్రాక్టర్లు, పదుల సంఖ్యలో టిప్పర్లతో ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామ శివారుల్లో పలు ప్రాంతాల్లో ఇసుక నిల్వ చేసి అక్కడి నుంచి టిప్పర్లతో ఇతర జిల్లాలకు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాగును ఆనుకొని ఉన్న రైతుల భూములు కోతకు గురై ఇసుక మేటలు పెట్టగా సదరు రైతులకు డబ్బులు చెల్లించి కొందరు అక్రమార్కులు ఇసుకను కొనుగోలు చేసి వేరే ప్రాంతాల్లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. భారీ టిప్పర్లతో ఇసుకను అక్రమంగా రవాణా చేయడంతో రోడ్లన్నీ ధ్వంసం కాగా ఇటీవల భీమారం మండలం మన్నెగూడెం వద్ద గ్రామస్థులు టిప్పర్లను అధికారు లకు పట్టించారు. ఇటీవల కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశాలతో కథలాపూర్ మండలంలోని తక్కళ్ళపల్లి, బొమ్మెన, సిరికొండ, పోసానిపేట, తాండ్ర్యాల, గం భీర్‌పూర్ గ్రామాల్లో అధికారులు ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెంచారు.

దాడులకు దిగిన మాఫియా

కోరుట్ల మండలం నాగులపేట, సంగెం, కథలా పూర్ మండలం తక్కళ్ళపల్లికి చెందిన పలువురు రెవెన్యూ సిబ్బందిపై దాడులకు దిగిన ఘటనలు చోటుచేసుకున్నాయి. వరద కాలువ వెంట భారీ డంపులను ఏర్పాటు చేసుకున్న మాఫియా ఆటు వరద కాలువపై అనునిత్యం నిఘా ఉండే లష్కర్లను కూడా బెదిరించిన ఘటనలు ఉన్నాయి. దీంతో రాత్రి వేళల్లో అధికారులు, పోలీసులు వరుసగా దాడులు చేస్తూ ట్రాక్టర్లు, టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నారు.

ప్రత్యేక బృందాలతో నిఘా



వినోద్, తహసీల్దార్, కథలాపూర్

గ్రామాల్లో జీపీవోలు, ఆఫీస్ అసిస్టెంట్లు, పోలీసులతో కలిసి నిరంతరం దాడులు చేస్తున్నాం. వాగు వెంట ఇసుక మాఫియా తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న దొంగదారుల వద్ద నిఘా ఉంచాం. ట్రాక్టర్లు, టిప్పర్లు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించాం. ఉన్నతాధికారులు భారీ జరిమానాలు విధించాలనే నిబంధన పెట్టారు.

హత్యాయత్నం కేసులో ఏడాది జైలు శిక్ష

జగిత్యాల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించడంతో పాటు హత్యాయత్నం చేసిన సంఘటనలో నిందితుడికి కరీంనగర్ మూడవ ఆడిషనల్ సెషన్స్ జడ్జి నీరజ ఏడాది కఠిన కరాగార జైల్ శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. వివ రాల్లోకి శితే.. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన సాగర్, నితిన్ ఇద్దరు స్వంత అన్నదమ్ములు కాగా, అదే గ్రామానికి చెందిన బత్తిని సంతోష్, నితిన్ ఇద్దరు మిత్రులు. అయితే, తన తమ్ముడిని నీతో తిప్పుకుంటూ వాడి చదువు నాశనం చేస్తున్నావ్ అంటూ సాగర్ సంతోష్‌ను మందలించడానికి యత్నించాడు. దీంతో తీవ్ర అసహనానికి గురైన సంతోష్ కులం పేరుతో దూషిస్తూ తీవ్రంగా గాయపర్చి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు పోలసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి డీఎస్పీ వెంకటరమణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశాడు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి కఠిన కారాగార జైల్ శిక్షతో పాటు వెయ్యి జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసులను జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

ఇసుక లారీ పట్టివేత

తిమ్మాపూర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అక్రమంగా, అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న లారిని పట్టుకున్నట్లు ఎల్ఎండి ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. తిమ్మాపూర్ బస్టాండ్ సమీపంలో అక్రమంగా, అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుకతో కూడిన లారీని ఎల్ఎండి పోలీసులు పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా నుంచి సిద్దిపేటకు తీసుకువెళ్తున్న లారీని తిమ్మాపూర్ బస్టాండ్ సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. లారీ డ్రైవర్ మర్రి నాగరాజుపై కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంటపొలాలు నీట మునిగాయని రైతుల రాస్తారోకో

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి పనులు చేపట్టిన డీబీఎల్ రోడ్డు కంపెనీ నిర్లక్ష్యం కారణంగా తమ పంట పొలాలు నీట మునిగాయని గురువారం మండలంలోని సింగాపూర్ గ్రామంలో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సింగాపూర్ చెరువు వద్ద రోడ్డు నిర్మాణ సంస్థ సరైన బ్రిడ్జిని నిర్మించకపోవడం వలన పంటలు నీట మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు మత్తడి పొంగిన సమయంలో నీరు సక్రమంగా పోక, బ్యాక్ వాటర్‌తో గ్రామానికి చెందిన దాదాపు 150 ఎకరాల వరి పంట పూర్తిగా మునిగిపోయిందన్నారు. వారం రోజుల్లో కోతకు సిద్దంగా ఉన్న పంటలు నీట మునగడంతో లక్షల్లో నష్టాపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుమ్మన్నపల్లి సింగిల్ విండో చైర్మన్ కౌరు సుగుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ సింగాపూర్ చెరువు వద్ద సరైన బ్రిడ్జి నిర్మించాలని జాతీయ రహదారుల డైరెక్టర్ కృష్ణారెడ్డికి, ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించకపోవడం మూలంగా రైతులు పంట నష్టపోయారన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న సీఐ సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించి పరిష్కారానికి చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



సింగాపూర్‌లో ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

ప్రవాహంలో కొట్టుకుపోయిన యువకుడు

● స్థానికుల సాయంతో సురక్షితంగా ఒడ్డుకు

గన్నేరువరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం చెరువు వద్ద కల్వర్టుపై ప్రవహించే వరదనీటిలో మండల కేంద్రం నుంచి కరీంనగర్‌కు వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై వెళుతూ బీహార్‌కు చెందిన రజీష్ అనే యువకుడు వరద ఉధృతికి నీటిలో కొట్టుకుపోయాడు. మత్తడి వద్ద గతంలో నిమజ్జనం చేసిన దుర్గామాత విగ్రహ స్టాండు వరదనీటిలో అతడి చేతికి అందడంతో దానిని పట్టుకొని ప్రాణాలతో బయటపడ్డాడు. వెంటనే స్థానిక మత్స్యకారులు గమనించి అతడిని తాడు సహాయంతో బయటకు తీశారు. వరద ఉధృతి ఉన్నందున కల్వర్టుపై వెళ్లకూడదని పోలీసులు స్టాపర్‌లను ఏర్పాటు చేసినప్పటికీ దానిని లెక్క చేయకుండా వెళ్లడంతో ప్రమాదం చోటుచేసుకుంది.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వీణవంక,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి):మండలంలోని రెడ్డిపల్లి గ్రామనికి చెందిన సుకాశి నరేష్ (35) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం నరేష్ కొంత కాలంగా మద్యానికి బానిస కాగా భార్య తన ఇద్దరు కూతళ్లతో వాళ్ల అమ్మగారింటికి వెళ్లింది. అప్పటి నుంచి తాగుతూ గ్రామంలోని వాళ్లతో గొడవపడుతున్నాడు. మంగళవారం మద్యం తాగి నరేష్ తన అన్న సురేష్‌కి ఫోన్ చేసి తిట్టడంతో సురేష్ రెడ్డిపల్లిలో నరేష్ వద్దకు వెళ్లి నెట్టి వేయడంతో బండపై పడి తలకు తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే వరంగల్ ఎంజీఎం అసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి సుకాని రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాటు్ల సీఐ లక్ష్మీనారయణ, ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

మానేరు వాగులో గల్లంతైన 16వేల బాతులు

మానకొండూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీనివాస్‌నగర్ శివారులోని మానేరు వాగులో బుధవారం రాత్రి 16వేల బాతులు గల్లంతు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాకు చెందిన డేవిడ్ అనే వ్యక్తి బతుకు దెరువు కోసం 16వేల బాతులతో మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామ శివారులోని మానేరు వాగులో తాత్కాలిక డేరా వేసుకొని జీవిస్తున్నాడు. ఎల్ఎండీ గేట్లు ఎత్తివేయడంతో వరద తాకిడికి 16వేల బాతులు గల్లంతు కాగా తమ కుటుంబం తప్పించుకొని ఒడ్డుకు చేరుకున్నట్లు బాధితుడు డేవిడ్ వాపోయాడు. సుమారు వీటి విలువ రూ. 20లక్షలు ఉంటుందని బాధితుడు లబోదిబో మంటున్నాడు.

మానేరులో దూకి ఒకరి గల్లంతు

తంగళ్లపల్లి, అక్టోబరు 30 (ఆంధజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సల్లంగుల కృష్ణ(60) మానేరు నదిలో దూకి అదృశ్యమైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుం బ సభ్యుల కథనం.. కృష్ణ కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తుండగా ఉపాధి లేకపోవడంతో పాటు అనారోగ్య సమస్యలు తోడయ్యాయి. ఆసుపత్రికి వెళ్తున్నాని కుటుంబ సభ్యులకు చెప్పి ఉదయం బయల్దేరిన కృష్ణ సాయంత్రం తంగళ్లపల్లి మానేరు వంతెన పైనుంచి నదిలో దూకాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు గాలింపు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికుడికి గాయాలు

ముత్తారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన సింగరేణి కాంట్రాక్టు కార్మికుడు, ఎన్ఎస్‌యూఐ నాయకుడు చేనవేన సాయికుమార్‌కు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. గురువారం సింగరేణిలో పనిముగించుకొని ఇంటికి తన ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో బేగంపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఒక్కసారిగా కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయలు ఆసుపత్రికి తరలించారు.

మెట్‌పల్లివాసి మృతిని ధ్రువీకరించిన ఎంబసీ

● ఐదేళ్లుగా బహ్రెయిన్ మార్చురీలోనే మృతదేహం ● అక్కడే అంత్యక్రియలు

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బహ్రెయిన్‌లో చనిపోయిన ఐదేళ్ల తర్వాత జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణం రాంనగర్‌కు చెందిన శ్రీపాద నరేష్ అనే వ్యక్తికి ఇండియన్ ఎంబసీ మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసింది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణం రాంనగర్‌కు చెందిన శ్రీపాద నరేష్ 2020 మే 28న బహ్రెయిన్ దేశంలోని ఓ ఆసుపత్రిలో మృతి చెందాడు. కాగా బహ్రెయిన్‌లోని ఇండియన్ ఎంబసీ 2025 అక్టోబరు 1న డెత్ సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అక్టోబరు 30న అధికారికంగా ఈ-మెయిల్ ద్వారా తెలియజేసింది. అనారోగ్యంతో చనిపోయిన శ్రీపాద నరేష్ మృతదేహాన్ని బహ్రెయిన్‌లోని ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. బహ్రెయిన్‌లోని ఇండియన్ ఎంబసీ అధికారులను ఉటంకిస్తూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో శ్రీపాద నరేష్ ఐదేళ్ల క్రితం మృతిచెందిన విషయం వెలుగులోకి వచ్చింది. మృతుడి సోదరుడు ధర్మపురి ఆనంద్ సహాయం కోసం ఈనెల 21న హైదరాబాద్‌లో 'సీఎం ప్రవాసీ ప్రజావాణి'ని ఆశ్రయించారు. నరేష్ మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాగా శ్రీపాద నరేష్ చనిపోయి చాలాకాలం అయినందున మృతదేహాన్ని భారత్‌కు తరలించడం సాధ్యం కాదని, అంత్యక్రియలు బహ్రెయిన్‌లోనే నిర్వహించాలని మృతుడి బంధువులకు ఎంబసీ సూచించింది. దీంతో శ్రీపాద నరేష్ అంత్యక్రియలకు బహ్రెయిన్ వెళ్లడానికి రాష్ట్ర ప్రభుత్వం, ప్రవాసీ సంఘాలు సహాయం చేయాలని అతడి సోదరుడు ధర్మపురి ఆనంద్ కోరాడు.

విద్యార్థుల మధ్య ఘర్షణ..?

వేములవాడ క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణ శివారులోని అయ్యప్ప స్వామి ఆలయం వెనుక భాగంలో ఉన్న మైనారిటీ గురుకుల సంక్షేమ విద్యాలయంలో ఈ నెల 26న ఆదివారం విద్యార్థుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు తెలిసింది. మైనారిటీ గురుకుల సంక్షేమ విద్యాలయంలో పదో తరగతితో పాటు ఇంటర్ ఉంది. అయితే పాఠశాల, ఇంటర్ విద్యార్థుల మధ్య టీ తాగే సమయంలో మాటమాట పెరిగి గొడవకు దారితీసిందని, ఈ విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ ఘర్షణకు కారణమైన విద్యార్థులపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

తల్లి, కొడుకుపై గొడ్డలితో దాడి

● చికిత్స పొందుతూ తల్లి మృతి

శంకరపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కరీంపేటలో తల్లి కొడుకుపై భార్య, భార్య తరుపు బంధువులు గొడ్డలితో దాడి చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కరీంపేట గ్రామానికి చెందిన గడ్డం మల్లవ్వ (65), తన కొడుకు గడ్డం రాజుపై రాజు భార్య, భార్య తరుపు బంధువులు గొడ్డలితో దాడి చేశారు. దాడిలో మల్లవ్వ, రాజు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలిలంచారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మల్లవ్వ మృతి చెందింది. రాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. కాగా కుటుంబ కలహాలే ఈ దాడికి కారణమని గ్రామస్థులు పేర్కొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠా అరెస్ట్

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇళ్లు, ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను మెట్‌పల్లి పోలీస్‌లు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్ వెల్లడించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లికి చెందిన ఒల్లెపు కాశీరాం, హైదరాబాద్‌కు చెందిన దండుగుల ఎల్లయ్య, బాన్సువాడకు చెందిన బోదాసు సాయిలులు ముఠాగా ఏర్పడి మెట్‌పల్లి, కోరుట్ల, మల్లాపూర్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, మెదక్ తదితర పట్టణాల్లో తాళం వేసిన ఇళ్లలో, ఆలయాల్లో చొరబడి బంగారం, వెండి, నగదు దొంగతనానికి పాల్పడేవారని తెలిపారు. దొంగిలించిన సొమ్మును పట్టణానికి చెందిన బంగారు వ్యాపారి తునికి వెంకటచారికి విక్రయిస్తుండేవారని పేర్కొన్నారు. ఎస్పీ అదేశాల మేరకు ప్రత్యేక బృందంగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి దొంగల ముఠాను గురువారం పట్టణంలోని లక్ష్మీ థియేటర్ సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 20 వేల నగదు, 15 గ్రాముల వెండి, 4 మొబైల్ ఫోన్లు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నాట్లు పేర్కొన్నారు. నిందితులు ఒల్లెపు కాశీరాం, దండుగుల ఎల్లయ్య, బోదాసు సాయిలు, తునికి వెంకటచారిలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వ్యాపారులు, ఇతరులు ఎవరైనా దొంగసొత్తును కొనుగోలు చేసే చట్టాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న మెట్‌పల్లి పోలీసులు

ఏఎల్‌పీలో సపోర్ట్‌మెన్‌కు అస్వస్థత

రామగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీలో సపోర్ట్‌మెన్ గురువారం అస్వస్థతకు గురయ్యాడు. ఏఎల్‌ఫీలో పి-షిఫ్టుల్లో 86లెవల్ వద్ద విధులు నిర్వహిస్తున్న సపోర్ట్‌మెన్ తోట రవి అస్వస్థతకు లోనై పనిస్థలంలో కిందపడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు రవిని హుటాహుటిన సర్ఫేస్‌కు తరలించారు. అనంతరం అంబులెన్స్‌లో సెంటినరీకాలనీ డిస్పెన్సరీకి తరలించారు. స్థానిక డిస్పెన్సరీ వైద్యుడి ప్రథమచికిత్స అనంతరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మరమ్మతులకు నోచుకోని వైకుంఠధామం



శ్రీనివాస్‌నగర్‌లో నిరుపయోగంగా ఉన్న వైకుంఠధామం

మానకొండూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో నిర్మించిన వైకుంఠధామం నిరుపయోగంగా మారింది. శ్రీనివాస్‌నగర్ గ్రామంలో ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోవడంతో సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మానేరు వాగు పక్కన రూ. 9లక్షల ఉపాధిహామీ నిధులతో నిర్మించారు. ఉపయోగంలో లేకపోవడంతో పిచ్చి చెట్లు మొలిచి అధ్వానం గా మారింది. నిర్మాణాలు కూడా చెడిపోయాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామం ఉపయోగంలో లేకుండా పోతోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక చొరువ తీసుకొని మరమ్మతు పనులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పాము పట్టివేత

ముత్తారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశనపల్లి గ్రామంలోని చొప్పరి రవి ఇంట్లో గురువారం పాము చొరబడింది. సమాచారం అందుకున్న అటవీశాఖ సెక్షన్ అధికారి నర్సయ్య, పాములు పట్టే గడ్డం శ్రీకాంత్ సహాయంతో ఇంట్లో దూరిన పామును పట్టుకుని, అటవీ ప్రాంతంలో వదిలేశారు.

మత్తు పదార్థాలపై ముమ్మర తనిఖీలు

ధర్మపురి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని పాన్ షాపు, కిరాణం షాపుల్లో పోలీస్ నార్కోటిక్ జాగిలాలతో, బాంబు డిస్పోజల్ టీమ్ సభ్యులు గురువారం తనిఖీలు నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ధర్మపురి పట్టణంలో డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజబుల్ (బీడీ) టీమ్ సభ్యుల సహకారంతో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సమయంలో బస్‌స్టాండ్ పరిసర ప్రాంతాలను ఒక్కొక్కటిగా పరిశీలించారు. అనుమానస్పద వస్తువులు, ప్యాకేజీలు, సంచులు లేదా భద్రతకు ముప్పు కలిగించే అంశాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో తనిఖీలు నిర్వహించడం వల్ల పటిష్ఠ భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేయడం జరుగుతుందని అన్నారు. పాన్ షాపుల్లో గంజాయి పదార్థాలను గుర్తించే జాగిలాలతో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఎస్ఐ ఉదయ్‌కుమార్, రవీందర్ కుమార్, డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజబుల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



ధర్మపురిలో జాగిలాలతో తనిఖీలు

ఉధృతంగా నీరుకుళ్ల మానేరు వాగు

సుల్తానాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ లోయర్ మానేరు డ్యాం గేట్లను ఎత్తివేయడంతో పెద్ద ఎత్తున వరదనీరు సుల్తానాబాద్ మండల పరిధిలోని గొల్లపల్లి, నీరుకుల్ల, గట్టేపల్లి, తొగర్రాయి తదితర మానేరు పరివాహక ప్రాంత గ్రామాల్లోని వాగులకు చేరింది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నీరుకుల్లలో చెక్‌డ్యాం మీదుగా వరదనీరు పొంగి పొర్లుతున్నది. మానేరు వాగులో ఉన్న భూనీల సమేత రంగనాయక స్వామి ఆలయం రక్షణగోడల వరకు నీరుచేరింది. చెక్ డ్యాంను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున వస్తున్నారు.



పొంగిపొర్లుతున్న నీరుకుళ్ల మానేరు వాగు చెక్ డ్యాం

వెంకటాపూర్ వాసికి డాక్టరేట్

కోరుట్ల రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన అనుమల్ల మహేష్ ఉస్మానియా విశ్వవిద్యాలయం మైక్రో బయోలాజీ డిపార్ట్‌మెంట్ నుంచి డాక్టరేట్‌కు ఎంపికయినట్లు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. 'ఐచిప్ సపోర్టెడ్ ఐసోలేషన్, ఐడెంటిపికేషన్ అఫ్ నావెల్ తెరాపిటిక్ మైక్రోబ్స్ టు ట్రీట్ హైపర్ యురిసేమియా' అనే అంశంపై చేపట్టిన పరిశోధనలకు డాక్టరేట్ వచ్చినట్లు తెలిపారు.

బాలుడి వైద్య చికిత్సకు ఫేస్‌బుక్ మిత్రుల విరాళం

జగిత్యాల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన అల్లాడి ప్రభాకర్-అనురాధ దంపతుల కుమారుడైన రుద్రాన్ష్ (3) అనే బాలుడు గత కొన్ని నెలలుగా బోన్ మ్యారో వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేక అపన్న హస్తం కోసం ఎదిరి చూస్తున్నారు. ఈ క్రమంలో ధర్మపురి నియోజకవర్గ కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ విషయం తెలుసుకుని సోషల్ మీడియాలో బాలుడి వ్యాధి గూర్చి, తల్లిదండ్రుల పేదరికం గూర్చి పోస్ట్ చేశాడు. స్పందించిన ఎన్నారైలు, స్థానిక దాతలు పలువురు బాలుడి వైద్యానికి తమ వంతు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకువచ్చి తోచిన విధంగా బాలుడి తల్లి బ్యాంక్ ఖాతాకు డబ్బులు పంపించారు. మొత్తం రూ. 1.61 లక్షలు పంపారు. జగిత్యాల టౌన్ పోలీసుస్టేషన్‌లో గురువారం సీఐ కరుణాకర్ చేతుల మీదుగాకొంత మొత్తాన్ని బాధిత బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు.

ప్రాజెక్టుల్లోకి పెరిగిన వరద



ఎల్ఎండీ నుంచి విడుదలవుతున్న నీరు

జగిత్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో ప్రాజెక్టులోకి వరదనీరు రావడం పెరిగింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 1,09,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 26 వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి ఒక లక్ష క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 1,09,654 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మిడ్ మానేరుకు భారీగా ఇన్ ఫ్లో

బోయినపల్లి: రాజరాజేశ్వర జలాశయానికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు గురువారం 9675 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ఎగువ భాగాన కురిసిన వర్షంతో మానేరు, మూలవాగు, వరదకాలువ ఇన్‌లెట్స్ ద్వారా వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో దిగువకు 3 గేట్ల ద్వారా 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.69 సామర్థ్యం 27.55 టీఎంసీలకు 26.760 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

ఇల్లంతకుంట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల గురువారంప్రారంభం అయ్యింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.49 టీఎంసీల నీరు ఉంది. క్యాచ్‌మెంట్ ద్వారా 300 క్యూసెక్కుల నీరు వస్తుండగా ఎగువన ఉన్న 11వ ప్యాకేజీలోని రంగనాయక సాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్ఎండీలోకి తగ్గుముఖం పట్టిన వరద

తిమ్మాపూర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం పూర్తి స్థాయిలో నిండుకుంది. తుఫాన్ కారణంగా భారీగా ఎగువ నుంచి వస్తున్న నీటిని గేట్ల నుంచి బయటకు విడుదల చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం దాదాపు 12గంటల వరకు కూడా కేవలం 1,277క్యూసెక్కుల నీరు మాత్రమే ఎల్ఎండిలోకి ఇన్‌ఫ్లోలు వస్తుండగా ఒక్కసారిగా కురిసిన భారీ వర్షం కారణంగా ఎగువ నుంచి అర్ధరాత్రి వరకు 66వేల క్యూసెక్కులకు పెరిగిపోయింది. దీంతో బుధవారం మధ్యాహ్నం కేవలం ఎల్ఎండీ రెండు స్పిల్‌వే గేట్లు ఎత్తి 4వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు క్రమంగా మిడ్ మానేరు నుంచి, మోయతుమ్మెద వాగు నుంచి వరద ఉధృతి భారీగా వస్తుండటంతో 14 స్పిల్ వే గేట్లు ఎత్తి 66వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గురువారం వర్షం తగ్గుముఖం పట్టడంతో ఎగువ నుంచి కూడా వస్తున్న వరద కూడా తగ్గుతుండటంతో గేట్లు క్రమంగా మూసివేశారు. ఎల్ఎండి పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టిఎంసిలు కాగా ప్రస్తుతం 22.918 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 6,896 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 274 టీఎంసీల నీరు బయటకు విడుదల చేస్తున్నారు.

ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలింపు చేపట్టండి

- దంపతుల గల్లంతుపై స్పందించిన బండి సంజయ్

భగత్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చెరువులో గల్లంతైన భార్యాభర్తల కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మల్లంపల్లి చెరువులో గల్లంతైన భార్యాభర్తల సమాచారం కోసం సిద్దిపేట కలెక్టర్‌కు ఫోన్ చేశారు. గల్లంతు వివరాలు తెలుసుకున్నారు. ఈ విషయంలో అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. స్థానిక బీజేపీ శ్రేణులు సహాయ చర్యల్లో పాల్గొనాలని, వర్ష ప్రభావ ప్రాంతాల్లో పర్యటించాలని పిలుపునిచ్చారు.

పీఎం కిసాన్ కోసం ఎదురుచూపులు



- కొత్త రైతులకు వర్తించని పథకం
- తగ్గుతున్న అర్హుల సంఖ్య

చొప్పదండి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2019లో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ప్రవేశపెట్టింది. అర్హులైన రైతులకు ఏటా ఆరు వేల రూపాయలను మూడు విడతల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుంది. ఈ పథకం కోసం అర్హులైన రైతులను దరఖాస్తు చేసుకోవాలని 2019 జనవరి 31 గడువు విధించింది.

కటాఫ్ తేదీగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం అర్హులైన రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందజేస్తుంది. కటాఫ్ తేదీని పొడగించక పోవడంతో కొత్త రైతులకు పథకం వర్తించడం లేదు. దాదాపు ఏడు సంవత్సరాలు కావస్తున్నా కటాఫ్ తేదీని పొడగించకపోవడంతో అనేకమంది రైతులు ఏళ్ల తరబడి పథకం కోసం ఎదురుచూస్తున్నారు.

2019 జనవరి తర్వాత భూములు పొందినవారు పీఎం కిసాన్ పథకం వర్తింపజేయాలని కోరుతున్నారు. కొత్త పట్టాదారు పాస్‌బుక్ ఉండి, రైతు మరణిస్తే వారసులు విరాసత్ ద్వారా భూములు పొందినవారు మాత్రమే కొత్తగా పీఎం కిసాన్ పథకం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఇప్పటి వరకు 20 విడతలుగా పెట్టుబడి సహాయాన్ని ఈ పథకం కింద అందించగా, తాము వేలాది రూపాయలను కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్పులతో తగ్గుతున్న సంఖ్య..

పీఎం కిసాన్ పథకంలో కొత్త నిబంధనలు, నూతన మార్పులతో ప్రతి ఏటా లబ్దిదారుల సంఖ్య తగ్గిపోతుంది. 10 వేల రూపాయలకు పైగా పింఛ న్ తీసుకునే రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు ఈ పథకానికి అనర్హులుగా ప్రకటించగా ఆదాయపన్ను చెల్లించేవారు, విదేశాల్లో నివాసం ఉండేవారు అనర్హులు. రైతు దంపతులకు వేర్వేరు గ్రామాల్లో భూములు ఉన్నా ఒక్కరికే వర్తిస్తుంది.

పీఎం కిసాన్ కోసం ఫార్మర్ రిజిస్ట్రీ..

పీఎం కిసాన్ పథకంతోపాటు ఇతర పథకాఆల కోసం కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీని తీసుకు వచ్చింది. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో తమ భూ వివరాలు, ఇతర వివరాలను పొందుపరిస్తే ఒక యూనిక్ ఐడీ నంబర్‌ను కేటాయించారు. ఆధార్ కార్డు మాదిరిగా ప్రతి రైతుకు ఒక కార్డును ఈ రిజిస్ట్రీ ద్వారా అందజేయనున్నారు. నాలుగు నెలల కింద ఈ ప్రక్రియను అన్ని గ్రామాల్లో చేపట్టగా దాదాపు 95 శాతం పూర్తయింది. రైతులందరు ఏఈఓల వద్ద ఫార్మర్ రిజిస్ట్రీలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కాగా ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారానే పీఎం కిసాన్ 21వ విడత సహాయం అందజేస్తారని సమాచారం. కొత్త రైతులు తమకు అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా కోరుతున్నారు.

పీజీ సెమిస్టర్ ఫలితాలు

గణేశ్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూలై 2025న నిర్వహించిన పీజీ, నాలుగు, రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. ఎం.ఏ(ఇంగ్లీష్, ఎకనామిక్స్, సోషియాలజీ, తెలుగు, ఉర్దూ), ఎంకాం. (జనరల్, ఫైనాన్షియల్ అకౌంటింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్, ఇన్సూరెన్స్), ఎంఎస్సీ (వృక్షశాస్త్రం, రసాయనశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, గణితం, మైక్రోబయాలజీ, ఫిజిక్స్ ఇంజనీరింగ్ ఫిజిక్స్ స్టాటిస్టిక్స్ న్యూట్రిషన్ డైటెటిక్స్ ఫూస్ సైన్స్ జువాలజీ), ఎంఎస్‌డబ్ల్యూ ఫలితాలు విడుదల చేశారు.

6న శ్రీశైలానికి ప్రత్యేక బస్సు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల6న గోదావరిఖని ఆర్‌టీసీ బస్టాండ్ నుంచి శ్రీశైలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీస్‌ను ఏర్పాటు చేసినట్లు గోదావరిఖని ఆర్‌టీసీ డిపో మేనేజర్ నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం, దేవిశక్తి పీఠం, పాతాళగంగ దర్శనం చేసుకుని 7వ తేదీ సాయంత్రం శ్రీశైలంలో బయలుదేరి 8వ తేదీ ఉదయం గోదావరిఖనికి చేరుకుంటుందని, ఈ సర్వీస్‌కు గోదావరిఖని నుంచి రూ.2200, పెద్దపల్లి నుంచి రూ.2100, కరీంనగర్ నుంచి రూ.2000చార్జిని నిర్ణయించినట్లు, ఈ అవకాశాన్ని గోదావరిఖని, పెద్దపల్లి, కరీంనగర్ వాసులు ఉపయోగించుకోవాలని కోరారు.

ఘనంగా గోదావరి హారతి



ధర్మపురి గోదావరి వద్ద హారతి



కొండగట్టులో కార్తీక దీపాలు



వేములవాడలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ధర్మపురి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి దీపం వెలిగించాలని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ అన్నారు. కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో తొమ్మిదవ రోజు గురువారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఏడాదిలో పవిత్ర మాసంగా భావించే కార్తీక మాసం సందర్భంగా ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా సాయంత్రం వేళలో గోదావరి నదికి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నది వద్ద శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి వరకు గోదావరి మాతకు హారతి ఇచ్చి భక్తి శ్రద్ధలతో నదిలో దీపాలు వదిలి పెట్టారు.

కొండగట్టులో..

మల్యాల: కార్తీకమాసం పురస్కరించుకొని కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవం కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు గురువారం రాత్రి దీపాలు వెలిగించారు. వేద పాఠశాల విద్యార్థులు, భక్తులు భజన, చాలీసా పారాయణం నిర్వహించారు.

వేములవాడలో...

వేములవాడ కల్చరల్ : వేములవాడ శ్రీభీమేశ్వర ఆలయంలో గురువారం కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి పలు ఆకృతుల్లో దీపాలను వెలిగించి పూలతో అలంకరించారు. అనంతరం అర్చకులకు దీపాదానం చేశారు. భీమేశ్వర స్వామివారిని ముంబై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నందేశ్ ఎస్. దేశ్‌పాండే దర్శించుకున్నారు.

చదువుల బంగారాలు.. అక్కాచెల్లెళ్లు



నర్మద



నీరజ

చందుర్తి అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు చదువులో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు అందుకోనున్నారు. మండలంలోని లింగంపేటకు చెందిన కాదాసు నర్మద, నీరజలది పేద కుటుంబం. ఇద్దరు అగ్రహారం కళాశాలలో 2020-22 విద్యా సంవత్సరంలో తెలుగులో ఎంఏ పూర్తిచేశారు. ఆధునిక కవిత్వం అనే అంశంలో నర్మద, జానపద విజ్ఞానం అనే అంశంలో నీరజ అత్యధిక మార్కులు సాధించారు. నవంబరు 7న కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో అక్కాచెల్లెళ్లిద్దరూ బంగారు పతకాలను గవర్నర్ చేతుల మీదుగా అందుకోనున్నారు.

గాయపడిన కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి

సుల్తానాబాద్, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కాట్నపల్లి గ్రామంలో కనుకదుర్గ రైస్‌మిల్లులో బాయిలర్ పేలిన ఘటనలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని లేబర్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. కార్మిక అధికారులు, సివిల్ సప్లయి అధికారులు విచారించి కనకదుర్గ రైస్‌మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు పెట్టి, చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు లేబర్ యూనియన్ ఆందోళన చేస్తుందని హెచ్చరించారు.

ధర్మపురి వద్ద పెరిగిన గోదావరి నీటి ప్రవాహం

ధర్మపురి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి నది నీటి మట్టం గురువారం పెరిగింది. తుఫాను కారణంగా గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి వాగుల ద్వారా ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతోంది. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం-నారాయణరెడ్డి ప్రాజెక్టు లోనికి భారీగా వరద నీరు చేరింది. కడెం ప్రాజెక్టు సంబంధించిన 4 గేట్లు ఎత్తి అధికారులు దిగువ గోదావరి నదిలోకి 34,514 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. సాయంత్రం 5 గంటల వరకు గోదావరి నదీ స్నానఘట్టాలు ఆనుకుని ప్రవహిస్తోంది. ఎస్ఆర్ఎస్‌పీ నుంచి 26 గేట్లు ఎత్తి 1,00,000 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల చేయడం వల్ల భారీగా వరద చేరి ప్రమాద స్థాయికి చేరుకుంది. నదీ తీరాన గల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



ధర్మపురి వద్ద స్నానఘట్టాలు ఆనుకొని ప్రవహిస్తున్న గోదావరి నది

రైతు కష్టం నీటిపాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొంథా తుఫాన్ పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. బుధవారం కురిసిన భారీ వర్షానికి ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం కళ్ల ముందే కొట్టుకుపోయింది. కోతకు వచ్చిన పంట నీట మునగడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



కాల్వశ్రీరాంపూర్‌లో నీట మునిగిన పంటను చూపిస్తున్న రైతు



పెగడపల్లి మండలం ఆరవెల్లిలో నీట మునిగిన ధాన్యం



ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో తడిసిన ధాన్యం ఆరబోస్తున్న రైతులు



గొల్లపల్లిలో మొలకెత్తిన వరి ధాన్యాన్ని చూపుతున్న రైతు



హుజూరాబాద్ మండలం జూపాకలో...

చొప్పదండి మండలం మంగళపల్లిలో నేలవాలిన మొక్కజొన్న



తిమ్మాపూర్ మండలం రేణికుంటలో నీట మునిగిన వరి





ధర్మారం మండలం మల్లాపూర్‌లో తడిసిన ధాన్యం చూపుతున్న రైతు



తిమ్మాపూర్ మండలం జుగుండ్ల గ్రామంలో తడిసిన ధాన్యం ఆరబెడుతున్న రైతు



దర్మపురి మండలం తిమ్మాపూర్‌లో తడిసిన పత్తి

చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





కోనరావుపేట మండలం బావుసాయిపేటలో కొట్టుకుపోయిన ధాన్యం

నేల వాలిన రైతుల ఆశలు





కోరుట్ల మార్కెట్ కమిటీలో తడిచిన మొక్కజొన్నను అరబెడుతున్న రైతు, సారంగాపూర్‌లో తడిచిన ధాన్యం, రాయికల్ మండలంలో నేలకొరిగిన వరి పంట

(ఐదో పేజీ తరువాయి)

జిల్లాలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు 73.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పెగడపల్లిలో 112.5 మిల్లీమీటర్లు కురిసింది. కథలాపూర్‌లో 99.4 మిల్లీమీటర్లు, కోరుట్లలో 93, భీమారంలో 87.3, మెట్‌పల్లి, కొడిమ్యాలలో 87.2, మల్యాలలో 84.2, సారంగపూర్‌లో 84, మేడిపల్లిలో 73.6, ఇబ్రహీంపట్నంలో 71.7, రాయికల్‌లో 71.2, జగిత్యాలలో 71.1, ఎండపల్లిలో 70.9, బుగ్గారంలో 68.3, జగిత్యాల రూరల్‌లో 65.3, మల్లాపూర్‌లో 63, వెల్గటూరులో 56.1, ధర్మపురిలో 45.7, గొల్లపల్లిలో 42.4, బీర్‌పూర్‌లో 38.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

జిల్లాలో 17,982 ఎకరాల్లో వరి పంట నష్టం..

జిల్లా వ్యాప్తంగా 230 గ్రామాల్లో 16,679 మంది రైతులకు చెందిన 17,982 ఎకరాల్లో వరి పంట నష్టానికి గురయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. భీమారం మండలంలోని 9 గ్రామాల్లో 526 మంది రైతులకు చెందిన 871 ఎకరాలు, మల్యాల మండలంలోని 15 గ్రామాల్లో 925 మంది రైతులకు చెందిన 1,170 ఎకరాలు, పెగడపల్లిలో 17 గ్రామాల్లో 1,432 మంది రైతులకు చెందిన 1,960 ఎకరాలు, రాయికల్‌లో 20 గ్రామాల్లో 1,215 మంది రైతులకు చెందిన 1,122 ఎకరాల్లో వరి దెబ్బతింది.

కొడిమ్యాలలో 15 గ్రామాల్లో 162 మంది రైతులకు చెందిన 275 ఎకరాలు, జగిత్యాల రూరల్‌లో 18 గ్రామాల్లో 284 మంది రైతులకు చెందిన 492 ఎకరాలు, వెల్గటూరులో 13 గ్రామాల్లో 446 మంది రైతులకు చెందిన 681 ఎకరాలు, కోరుట్లలో 15 గ్రామాల్లో 1,612 మంది రైతులకు చెందిన 2,201 ఎకరాలు, మల్లాపూర్‌లో 20 గ్రామాల్లో 949 మంది రైతులకు చెందిన 1,046 ఎకరాలల్లో వరి దెబ్బతింది. కథలాపూర్‌లో 19 గ్రామాల్లో 3,148 మంది రైతులకు చెందిన 2,934 ఎకరాలు, మెట్‌పల్లిలో 19 గ్రామాల్లో 1,935 మంది రైతులకు చెందిన 1,570 ఎకరాలు, ఇబ్రహీంపట్నంలో 16 గ్రామాల్లో 1,326 మంది రైతులకు చెందిన 991 ఎకరాలు, సారంగాపూర్‌లో 5 గ్రామాల్లో 30 మంది రైతులకు చెందిన 80 ఎకరాలు, బుగ్గారంలో 10 గ్రామాల్లో 542 మంది రైతులకు చెందిన 635 ఎకరాలు, ఎండపల్లిలో 13 గ్రామాల్లో 1,250 మంది రైతులకు చెందిన 1,619 ఎకరాలలో వరి పంట నష్టానికి గురయినట్లు వ్యవసాయ అధికారులు సర్వేలో తేల్చారు.

● 1,146 ఎకరాల్లో దెబ్బతిన్న పత్తి

కాగా జిల్లాలో 1,066 మంది రైతులకు చెందిన 1,146 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నట్లు అధికారులు తేల్చారు. ఎండపల్లి మండలంలో 13 గ్రామాల్లో 572 మంది రైతులకు చెందిన 500ఎకరాలు, బుగ్గారం మండలంలోని 10 గ్రామాల్లో 331 మంది రైతులకు చెందిన 372 ఎకరాలు, వెల్గటూరు మండలంలో 163 మంది రైతులకు చెందిన 274 ఎకరాల్లో పత్తి పంట నష్టానికి గురయినట్లు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలకు తరలించి నిల్వ చేసిన ధాన్యం కుప్పల వద్దకు వర్షపు నీరు చేరి సుమారు 2 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తడిచిపోయినట్లు అంచనా ఉంది.

● రెండు చోట్ల నిలిచిన రాకపోకలు..

పలు చోట్ల వర్షపు నీరు రహదారులు, లో లెవల్ కల్వర్టులపై నుంచి పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్-ఫకీర్ కొండాపూర్ మధ్య అప్రోచ్ రోడ్డు తెగిపోయి వరద నీరు పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లి-మాదాపూర్ మధ్య రోడ్డుపై వాగునీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యం

● జగిత్యాలరూరల్: జగిత్యాల మండలంలోని తిమ్మాపూర్, మోరపల్లి, తాటిపల్లి, చల్‌గల్, కల్లెడ, గ్రామాల్లో వరిపంటలకు తీవ్ర నష్టం వాటిల్లడంతో వరిపైరు నేలవారింది. సుమారు వందల ఎకరాల్లో వరి నేలవారినట్లు రైతులు తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలో ధాన్యం పూర్తిగా తడిచిపోయింది.

● కోరుట్ల రూరల్: మండలంలోని కొనుగోలు కేంద్రాల వర్షం నీరు నిండి ధాన్యం నిలువలు తడిచి పోయాయి. కోరుట్ల మార్కెట్ యార్డులో నిలువ ఉన్న మొక్కజొన్న తడిచిపోయింది. చిన్నమెట్‌పల్లి గ్రామంలోని పెద్ద చెరువు నుండి మత్తడిపై నుండి ప్రవహించంగా మాదాపూర్ - చిన్నమెట్‌పల్లి రహదారిపై నుండి ప్రవహించంగా రాకపోకలు నిలిచి పోయాయి. కల్లూర్ గ్రామం శివారులోని పెద్ద వాగు ప్రమాదంగా ప్రవహించడంతో వాహనాలను మాదపూర్ మీదుగా దారిమల్లించారు.

● కోరుట్ల: పట్టణంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు కురిసి బారీ వర్షంతో లోతట్లు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పట్టణంలోని అయిలాపూర్ రోడ్డు, కల్లూర్ రోడ్డు, ప్రకాశం రోడ్డు, అనంద నగర్, బీలాలుపుర, రథల పంపు ప్రాంతాలు రోడ్లపై వర్షం నీరు ప్రవహించడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

● మెట్‌పల్లి రూరల్: కొనుగోలు కేంద్రాల్లో అరబోసిన ధాన్యం తడిసి ముద్ధ అయింది. మండలంలోని అల్లూరిసీతారామతండా గ్రామ శివారులోని రోడ్డుపై నుంచి ఉధృతంగా నీరు ప్రవహించడంతో గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

ధర్మపురి మండలంలో..

● ధర్మపురి: ధర్మపురి మండలంలో కురిసిన భారీ వర్షాల వల్ల వరి పంట నేల వాలింది. పత్తి పంట దెబ్బతిని తీవ్రంగా నష్టం వాటిల్లింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని తిమ్మాపూర్, రాయపట్నం, రామయ్యపల్లె, కమలాపూర్, నాగారం, దమ్మన్నపేట, రాజారం, పెద్దనక్కలపేట, దొనూర్ గ్రామాల్లో సుమారు 1500 ఎకరాల్లో వరి పంట నేల వాలింది. మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్, ఏఈవో సమత, అజయ్, నవ్య పంట నష్టం వాటిల్లిన వరి పొలాలు, పత్తి చేనులను సందర్శించారు. నేల వాలిన వరి పంట సుమారు 920 ఎకరాలుగా ప్రాథమికంగా అంచనా వేసి జిల్లా వ్యవసాయాధికారికి నివేదిక పంపించారు.

● మల్లాపూర్: మండలంలో రెండు రోజులుగా కురుస్తన్న వర్షాలకు అన్నదాత తీవ్రంగా నష్టపోయారు. కోతకు వచ్చిన పొలాలు నెలకొరిగి నీటి పాలు అయ్యాయి. అమ్మకానికి సిద్ధంగా ఉన్న మొక్కజొన్న కాపాడుకోనేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● రాయికల్: మండలంలోని పలు గ్రామాల్లో చేతికొచ్చిన వరి పంట నేలకొరిగింది. చేతికందివచ్చిన వరి పంట నేలమట్టం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని జిల్లా రైతు నాయకుడు మెక్కొండ రాంరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని రాయికల్, కుమ్మరిపెల్లి, మహితాపూర్ గ్రామాల్లో నష్టపోయిన పంటలను గురువారం మండల వ్యవసాయ శాఖ అధికారి ముత్తయ్య పరిశీలించారు.

వర్షంతో రహదారులు అధ్వాన్నం

● మల్యాల: రెండు రోజులుగా కురిసిన వర్షంతో రైతుల ధాన్యం తడిచిపోగా గురువారం ఆరబెట్టారు. గురువారం ఉదయం వరకు కురిసిన వర్షంతో రహదారులు బురదగుంటలతో ప్రయాణానికి అసౌకర్యంగా మారాయి. మల్యాల మండల కేంద్రంతో పాటు బైపాసు మార్గం రహదారులు కోతకు గురి అయ్యాయి.

● సారంగాపూర్: మండంలోని పలు గ్రామాల్లో వరి పంటలు నేల వాలాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. రాత్రి కురిసిన బారీ వర్షం పొలాల్లో వరద నీరు వచ్చి చేరడంతో కోతకొచ్చిన పంట నీటిలో మునిగి పోయింది.

● భీమారం: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లో చేతికందివచ్చిన వరి పంట నేలకొరిగింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ నాంచారి స్వప్నరాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

● వెల్గటూర్: పైడిపల్లి, శాఖాపూర్, రాంనూర్, ముత్తునూర్, ముక్కట్రావ్‌పేట, చెగ్యాం గ్రామాలతో పాటు మరి కొన్ని గ్రామాలలో వరి పంట నేలకొరిగింది. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను ఏఈవోలు మౌనిక ఫిర్దోస్‌లు పరిశీలించి పంట నష్టం వివరాలను సేకరించారు. మండలంలో 449 రైతులకు సంబంధించిన 760 ఎకరాల వరి పంట, 66 మంది రైతలకు సంబంధించిన 125 ఎకరాల పత్తి పంట నష్టం వాటిల్లినట్లు అంచనా వేసినట్లు మండల వ్యవసాయాధికారి సాయి కిరణ్ తెలిపారు.

పత్తిచేన్లలో ఇసుక మేటలు

● గొల్లపల్లి: గొల్లపల్లి మండలంలో గురువారం తెల్లవారు జామున కురిసిన అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. శ్రీరాముల పల్లె వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం కొనుగోళ్లలో జరిగిన జాప్యానికి తోడు వర్షానికి ధాన్యం మొలకెత్తి రైతాంగానికి తీరని వేధనను మిగిల్చింది. మండలంలోని 27 గ్రామాల్లో భారీ వర్షం కురిసి రైతాంగానికి తీరని నష్టాన్ని మిగిల్చింది. తడిసిన వరి ధాన్యంను ప్రభుత్వ మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

● కొడిమ్యాల: మండలంలోని తిప్పయ్యపల్లి, నల్లగొండ, చెప్యాల, నమిళికొండ, శ్రీరాములపల్లి, తురుకకాశీనగర్ గ్రామాలలో ఏఈవోలు శ్రీలత, రాజేష్ నేల వాలిన పంటలను పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాలలో 19500 ఎకరాలలో వరి పంటను వేయగా ఇప్పటి వరకు కిరిసిన ఆకాల వర్షాలకు 275ఎకరాలలో 162మందికి చెందిన వరి పంట నేలకు వాలినట్లు వ్యవసాయ శాఖ అధికారులు గురువారం నాటికి అంచనా వేసారు. కార్యక్రమంలో ఏవో జ్యోతి పాల్గొన్నారు.

● పెగడపల్లి: మండలంలోని ఆరవెల్లి, మద్దులపల్లి కొనుగోలు కేంద్రాలలో పోసిన ధాన్యం కుప్పలు నీట మునగడంతో పాటు పలువురి ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోయింది. వెంగళాయిపేట కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం రాశులు నీటమునగడంతో ధాన్యం తడిచిపోయింది.

● ఇబ్రహీంపట్నం: మండలంలోని మొక్కజొన్న, వరి పంటలు నీటమునిగాయి. కొనుగోలు కేంద్రాల్లో పోసిన మొక్కజొన్న, వరి కుప్పలు తడిచి ముద్దయ్యాయి. మండల వ్యవసాయ అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో నీటమునిగిన పంటలను పరిశీలించారు.మండలంలో సుమారుగా990 ఎకరాల్లో వరి పంట నేలకొరిగినట్లు అంచనా వేసినట్టు మండల వ్యవసాయధికారి రాజ్‌కుమార్ పేర్కొన్నారు.




మాదాపూర్-చిన్నమెట్‌పల్లి రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు, వెల్గటూర్ మండలం ముత్తునూర్‌లో వరి పొలంలో నిలిచిన నీరు

జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌దే విజయం

-మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ఉప ఎన్నిక ప్రచారంలో మంత్రులు లక్ష్మణ్ కుమార్, శ్రీధర్‌బాబు

జగిత్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కట్టనున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం సందర్భంగా జిల్లాలోని మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దుద్దిళ్ల శ్రీధర్ బాబులను కలిశారు. ఈకార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతుల వివాహాలకు చేయూత

ఇబ్రహీంపట్నం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నేరెళ్ళ దేవేందర్ తమ గ్రామంలో పెళ్లి చేసుకుంటున్న ప్రతి ఆడబిడ్డకు తమ కుటుంబం తరుపున రూ.5016 ఆడబిడ్డ కట్నంగా అందజేస్తున్నారు. గత ఏడు సంవత్సరాలుగా గ్రామంలో 75 మంది తమ గ్రామ ఆడబిడ్డలకు నేరెళ్ళ వారి కల్యాణ కానుక పేరుతో ఆడబిడ్డ కట్నం అందజేసినట్టు మాజీ ఎంపీపీ నేరెళ్ళ దేవేందర్ తెలిపారు. గురువారం గ్రామానికి చెందిన ఇద్దరు ఆడపిల్లలు ధర్మారపు సాహిత్య, చెప్యాల వైష్ణవి ల పెళ్లిళ్ల నేపథ్యంలో వారికి ఒక్కొక్కరికి రూ.5016 కట్నంగా అందజేశారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులైన్

-తడిసిన వరి -ఆందోళన చెందుతున్నరైతు

కొడిమ్యాల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల-పూడూర్ రహదారి పక్కన ఉన్న మండలంలోని అప్పారావుపేట గ్రామానికి చెందిన గుడిపెల్లి బాపురెడ్డికి చెందిన పండిన వరి పొలం పక్కన మిషన్ భగీరథ పైపు లైన్ ఇటీవల పగిలింది. దీంతో నీరు లీక్ కావటంతో సంబందిత అధికారులు మరమ్మత్తులు చేయించినట్లు గ్రామస్తులు తెలిపారు. మరమ్మత్తు సరైన విదంగా చేయక పోవటంతోనే బుధవారం రాత్రి పైపు పగలటంతో మా పండిన వరి పొలంలోకి నీరు చేరిందని బాపురెడ్డి అనే రైతు గురువారం తెలిపాడు. ఈ విషయమై సంబందిత మిషన్ భగీరథ ఏఈ కె.వినయ్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా గతంలో మిషన్ భగీరథ పైపులీకయింది వాస్తవమె అన్నారు. దానికి మరమ్మత్తు చేయించగా రెండవసారి అదే పైపునకు కొంత దూరంలో లీకయిందన్నారు. పగిలిన పైపు మరమ్మతు చేయిస్తామన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామన్నారు.

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు

● జగిత్యాల మున్సిపల్ కమిషనర్ స్పందన

జగిత్యాల టౌన్, అక్టోబర్ 30(ఆంధ్రజ్యోతి) :జగిత్యాల పట్టణంలో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమీషనర్ స్పందన హెచ్చరించారు. జగిత్యాల పట్టణంలోని జంబిగద్దె ప్రాంతంతో పాటు బైపాస్ రోడ్‌లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో వెళ్ళారు. అయితే తమది అక్రమ నిర్మాణాలు కావని తమ స్థానంలోనే నిర్మించుకున్నామని బాధితులు చిగురు సత్తమ్మ, జంగిలి రాజమౌళిలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది వరకే ఓసారి గోడ నిర్మాణాలను కూల్చేందుకు మున్సిపల్ అధికారులు వెళ్ళగా వారు కోర్టును ఆశ్రయించారు. నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని కోర్టు పేర్కొంది. దీంతో మున్సిపల్ అధికారులు గురువారం పోలీస్ బందోబస్తుతో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు ఎక్స్‌కవేటర్‌తో వచ్చారు. బాధితులు కొద్దిసేపు ఆందోళన చేసి మున్సిపల్ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. చివరకు తమ నిర్మాణాలను కూల్చి వేయవద్దని , తమకు కొంత గడువు ఇస్తే తామే కూల్చి వేస్తామని పేర్కొడనడంతో అధికారులు వెనుదిరిగారు.

జగిత్యాల పట్టణంలో ఎక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టినా రోడ్డు ఆక్రమించిన కఠిన చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా మున్సిపల్ కమీషనర్ హెచ్చరించారు. ఏ నిర్మాణం అయిన నిబంధనల మేరకే చేపట్టాలని, అనుమతులు ఒక రకంగా నిర్మాణాలు మరోరకంగాచేపట్ట వద్దని హెచ్చరించారు. ఇప్పటికే జగిత్యాల పట్టణంలో ఇరుకు రోడ్డు ఉన్నాయని ఖచ్చితంగా సెట్ బ్యాక్ తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

అన్నదాతలను విస్మరించిన ప్రభుత్వం

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన కేసీఆర్ అన్నివర్గాల ప్రజల కోసం పథకాలు అమలు చేశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు ఏళ్లలో రైతుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విస్మరించిందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులో కురిసిన వర్షానికి నీట మునింగిన, నెలకొరిగిన వరి పంటలు, తడిసిన మొక్కజొన్న ధాన్యం కుప్పలు, మొలకలు వచ్చిన మొక్కజొన్న కంకులను రైతులు చూపగా వాటిని మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డితో కలిసి పరిశీలించారు. కౌలు సాగు చేసిన రైతులు ధాన్యం అమ్ముకొలేని పరిస్థితి ఉందని ఎమ్మెల్యేకు సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన రైతులను అదుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని, ఎకరానికి 18 కింటాల ధాన్యం మాత్రమే తూకం వేయడం, కౌలు రైతులు పండించిన ధాన్యం విక్రహించలేని పరిస్థితితో వారు ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వం అవకాశాలు కల్పించాలన్నారు. వర్షానికి నష్ట పోయిన రైతులకు ఎకరానికి సన్నపు రకం వడ్లకు రూ. 30వేలు, దొడ్డు రకం వడ్లకు రూ. 20వేలు అందజేసి అదుకోవాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. అదే విధంగా జగ్గసాగర్ గ్రామంలో నష్టపోయిన వరి పంట పొలాలను బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి, వేంపేటలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మేడిపల్లిలో ఏవో దీపిక నష్టపోయిన పంటలను పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న మొక్కజొన్నను పరిశీలిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

-జగిత్యాల పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజులుగా మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జగిత్యాల వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షుడు పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి కోరారు. కోతకు వచ్చిన వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలకు తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి కోతకు వచ్చిన వరి పంట నేలరాలిందని, పలుచోట్ల పొలాల్లో నీరునిండి ఇసుక మేటలు వేసిందన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

'తేమతో సంబంధంలేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి'

కథలాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని బీజేపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను బీజేపీ మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర రావు స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిందని తేమతో సంబంధం లేకుండా ధాన్యం కోనుగోలు చేయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహేష్, గడ్డం జీవన్‌రెడ్డి, కాసోజీ ప్రతాప్, మల్యాల శ్రీకర్, అందే భూమేష్, తాలుక మల్లేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫెలోషిప్

జగిత్యాల అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సీసీఆర్‌టీ ఆధ్వర్యంలో కూచిపూడి, పేరిణి, శాస్త్రీయ నాట్యం నేర్చుకునే విద్యార్థులకు 2025-26 సంవత్సరానికి వార్షిక ఫెలోషిప్ అందజేస్తున్నట్లు జగిత్యాల పట్టణానికి చెందిని మేదిని కళాక్షేత్రం ప్రిన్సిపల్ మేదదిని భుజంగరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10 నుంచి 14 ఆపై సంవత్సరాల విద్యార్థులకు సంవత్సరానికి 11,600 చొప్పున మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని మేదిని లలిత కళాక్షేత్రం మేదిని భుజంగరావు ఆధ్వర్యంలో తెలుగు యూనివర్సిటీ వారు నిర్వహించే కూచిపూడి, పేరిణి, నాట్యం పరీక్షలు రాసే విద్యార్థులకు సీసీఆర్‌టీ స్కాలర్‌షిప్ కోసం నిర్దేంచిన సెలబస్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రదర్శనలకు పంపిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9441132186 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎకరానికి రూ. 50 వేలు నష్టపరిహారం చెల్లించాలి

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్



నేలవాలిన వరి పంటను పరిశీలిస్తున్న మాజీ జడ్పీచైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఎకరాకు రూ.50వేలు చెల్లించాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల రూరల్ మండలం హైదరాపల్లి గ్రామంలో వర్షాల కారణంగా నష్టపోయిన పంట పొలాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ వర్షాల వల్ల నష్టపోయిన రైతులు కన్నీరు కారిస్తే ఎమ్మెల్యేలు, మంత్రులు కనీసం పట్టించుకోకుండా రాజధాని లో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పంటనష్టం అంచనా వేయాలని కోరారు. ప్రభుత్వం జాప్యం లేకుండా వెంటనే ధాన్యం కొనుగోలు సెంటర్లను వెంటనే ప్రారంభించి కొనుగోలు చేయాలన్నారు. రైతు డిక్లరేషన్ పేరిట రైతులను కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో రైతులు గంగారెడ్డి, గంగాధర్, భీమయ్య, ఆదిరెడ్డి, మహేష్, శేఖర్, నరేష్, శశి గంగన్న, శ్రీనివాస్, చంద్రశేఖర్, చందు, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారుల సేవలు స్ఫూర్తిదాయకం

-ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారుల సేవలు స్ఫూర్తిదాయకమని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. పదవీవిరమణ పొందిన ఎస్సై వెంకటరావు, ఏఎస్ఐలు బాలీజీ, గజేందర్, హెడ్ కానిస్టేబుల్ ప్రవీణ్‌లను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ శాలువ, పూలమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ఎన్నో రకాల త్యాగాలతో పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలు అందిచడం ఎంతో గర్వకారణం అన్నారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదని అన్నారు. విజయవంతంగా సర్వీస్ పూర్తిచేసిన అధికారుల సేవలను ఈ సందర్భంగా ఎస్పీ గుర్తు చేస్తూ వారి అనుభవం, సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పదవీ విరమణ పోలీసులను పోలీస్ వాహనాల్లో వారి కుటుంబ సభ్యులతో ఇంటికి పంపించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయికల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎంపీటీసీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్త బూరుగుల రాజేందర్ కుటుంబాన్ని బీజేపీ జిల్లా నాయకుడు పడాల తిరుపతి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట బీజేపీ పట్టణ అధ్యక్షుడు కురుమ మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు ఆకుల మహేష్, ఎస్టీ మోర్చా నాయకుడు బానావత్ తిరుపతి, ఆర్ఎస్ఎస్ నాయకులు కురుమ పెద్ద మల్లారెడ్డి, జున్ను సంతోష్ తదితరులు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

భీమారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు నాగం శివకుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని దేశాయిపేట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించి వారం రోజులైనా కొనుగోలు చేయడంలేదని తెలిపారు. ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ తక్షణమే మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి గోదాములకు తరలించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల ఉపాధ్యక్షుడు గోపు సాయిరెడ్డి, సీనియర్ నాయకులు గంగారెడ్డి, బద్దం జలపతి రెడ్డి, సంతోష్, పల్లి వంశీకృష్ణ, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా తిరునక్షత్ర వేడుకలు

కోరుట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వర దేవాలయంలో తిరునక్షత్ర వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. దేవాలంయంలో వేదపండితుడు నర్సింహమూర్తి ప్రత్యేక పూజలను నిర్వహించి అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపారు. ఈ సందర్భంగా భక్తులు 108 ప్రదక్షిణలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎతిరాజం నర్సయ్య, డైరెక్టర్లు నేతి శ్రీనివాస్, దివాకర్, నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంతోపాటు మొగిలిపేట, గుండంపల్లి గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం తిరునక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో వేకువజామునే అభిషేకం, అర్చనలు, పూజలు నిర్వహించారు.